ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 120
సంచిక : 241
పేజీలు : 3

శుక్రవారం 15 మే, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## భర్త వేధింపులకు భార్య మృతి



**టీ మీడియా, మే 14, కురవి :**

తాళి కట్టినవాడు వేధింపులు తాళలేక మృతి చెందిన సంఘటన కురవి మండల కేంద్రంలో జరిగింది. స్థానిక కురవి ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం....కురవి మండల కేంద్రం లోని చెంచు కాలనీకి చెందిన మండల వెంకన్న తన మూడో కూతురు రమణను కురివికే చెందిన గుజ్జుమదుకు 2025 లో ఇచ్చి వివాహం చేశారు.పెండ్లి అయినప్పటి నుండి భర్త మధు రమణ/మృతురాలి కి అక్రమ సంబందములు అంటగట్టి గొడవలు పడుతూ వేదించి , చిత్రహింసలకు గురిచేసేవాడని. 13 బుధవారం నాడు సాయంత్రం సమయం లో కురవి ఊరు బయట వరిపోలాల్లో మధు తన భార్య మృతురాలును చేతులతో కొట్టి , కడుపులో తన్ని మెడలోని పూస్తెల తాడు, కాలి మెట్టెలు తీసుకొని కొట్టుకుంటూ చీర కొంగు పట్టుకొని లాక్కుంటూ సాయంత్రం 5.30 గంటల సమయం లో కర్నాటి వాసు వ్యవసాయ బావి వద్దకు తీసుకొని పోయి అక్కడ కూడా కొట్టి బావిలో దూకి చావు లేక పోతే నేనే బావిలోకి నెడతా అని హింసించి ఆత్మ హత్యకు పురికొల్పగా బావి లోకి దూకి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# పదేళ్లు గోసపెట్టి.. ఇప్పుడు 'సోల్లు' పురాణమా?



## ప్రజా దర్బార్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**టి మీడియా, మే 14, ఖమ్మం రూరల్ :**

పదేళ్ల అధికార దాహంలో పేదవాడిని విస్మరించి, నాడు రైతుల చేతులకు సంకెళ్లు వేసిన వారు.. నేడు రంగు రంగుల అవతారాలతో వస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో జరిగిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' క్లస్టర్-1 సమావేశంలో ఆయన ముఖ్యాతిథిగా పాల్గొని ప్రసంగించారు.నాడు వరి వేస్తే ఉరి.. నేడు కపట కన్నీరుప్రతిపక్షాల తీరును ఎండగడుతూ.. నాడు అధికారంలో ఉండి వరి వేస్తే ఉరి అని రైతులను భయపెట్టిన దొరవారు, నేడు రైతుల కోసం పోరాడుతున్నామంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. దోసెల్లో మొక్కలు పెట్టుకుని, కుండలకు పూతలు పూస్తూ ఫోటోలకు ఫోజులిస్తే ప్రజలు మోసపోరు. మీ పదేళ్ల పాలనలో అధికారులు ఏనాడూ పేదల వద్దకు రాలేదు, కానీ ఈనాడు మేమే స్వయంగా ప్రజల గడప వద్దకు వచ్చి అప్లికేషన్లు తీసుకుంటున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.విషం కక్కుతున్న విపక్షాలు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు ఒంటి నిండా విషాన్ని నింపుకొని రోడ్ల వెంట విషం కక్కుతున్నాయని మంత్రి మండిపడ్డారు. మూడు నాలుగు సార్లు ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా మీకు జ్ఞానం రాలేదు. కుట్రలు, కుతంత్రాలతో ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని చూస్తే మీ కన్న కలలు కలలుగానే మిగిలిపోతాయని బీఆర్‌ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. ప్రజా దీవెనలు ఉన్నంత వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరూ ఏమీ చేయలేరని హెచ్చరించారు.చేతల్లో చూపిస్తున్నాంసోల్లు పురాణం చెప్పే ప్రభుత్వం మాది కాదు.. చేతల ప్రభుత్వం. ఇప్పటికే 73 వేల ఉద్యోగాలు ఇచ్చాం. నిరుద్యోగులకు త్వరలోనే మరిన్ని శుభవార్తలు చెబుతాం. గత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను కాగితాలకే పరిమితం చేస్తే, మేము ఒక్క రూపాయి అవినీతి లేకుండా ?5 లక్షల ఆర్థిక సాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, చైర్మన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, 15 వార్డుల కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



## అశ్వారావుపేట అభివృద్ధికి జీవితాంతం కట్టుబడి ఉంటా

- మంత్రి తుమ్మల నాగేశ్వరావు

**టి మీడియా, మే 14, అశ్వారావుపేట:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో పామాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే శ్రీ జారే ఆదినారాయణ ప్రభుత్వ హార్టికల్చర్ కళాశాలను ప్రారంభించిన అనంతరం అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పదిహేను జిల్లాలకు చెందిన ఆయిల్ పామ్ రైతులు, ఆయిల్ ఫెడ్ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.సమ్మేళనం ప్రారంభానికి ముందు మంత్రి తుమ్మల నాగేశ్వరావుకు రైతులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. సంప్రదాయ బృందాల నృత్యాలు, డప్పు



కళాకారుల ప్రదర్శనలు, గిరిజన మహిళల హారతులతో సభా ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది. అనంతరం రైతులు మంత్రికి పూలమాలలు వేసి సన్మానించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరావు గారి 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని ప్రత్యేక డిజిటల్ ప్రదర్శన రూపంలో సభలో ప్రదర్శించారు. ఆయన ప్రజా జీవితం, రైతు సంక్షేమం

మిగతా 3లో...

## రైతుల కష్టం.. వసూళ్ల పర్వం

- వేర్‌హౌసింగ్ గోదాము వద్ద ఉద్రిక్తత

**టీ మీడియా, మే 14, ఖమ్మం రూరల్:**

ఖమ్మం రూరల్ పరిధిలోని పెద్దతండా వద్ద గల స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ గోదాముల వద్ద గురువారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మొక్కజొన్న రైతుల నుంచి గోదాము ఉద్యోగులు, హమాలీలు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలతో పరిస్థితి ఘర్షణకు దారితీసింది. తమను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ రైతులు ఆందోళనకు దిగడంతో అక్కడ యుద్ధ వాతావరణం నెలకొంది.ట్రక్కుకు రూ. 500 అదనపు వసూళ్లు?కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామని



మిగతా 3లో...



# సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**టీ మీడియా, మే 14, జూలూరుపాడు :**
రాబోయే బక్రీద్ పండుగ దృష్ట్యా పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పండుగ నేపథ్యంలో పశువులను అక్రమంగా తరలించే వాహనాల తనిఖీ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాల సరిహద్దుల నుంచి జరిగే పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 ద్వారా తెలియజేయాలని కోరారు. ఎవరూ కూడా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదు. ఎవరైనా చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## ఉచిత కరాటే శిక్షణకు శ్రీకారం



**టీ మీడియా,మే14,సింగరేణి(కారేపల్లి):**
ఖమ్మం జిల్లా సింగరేణి గ్రామంలోని పిల్లలు,యువతలో ఆత్మరక్షణ, క్రమశిక్షణ, శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి టోనీ ఆధ్వర్యంలో ఉచిత కరాటే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకొని గ్రామానికి చెందిన బాలబాలికలు, యువతకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కరాటే నేర్చుకోవాలనే ఆసక్తి గల విద్యార్థిని, విద్యార్థులు గ్రామపంచాయతీ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 6 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల లోపు ఉన్న పురుషులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు. కరాటే ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు ఆత్మరక్షణ నైపుణ్యాలు మెరుగుపడతాయని, ముఖ్యంగా పిల్లలలో ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని సర్పంచ్ టోనీ పేర్కొన్నారు. ఈ శిక్షణ పూర్తిగా ఉచితమని, సింగరేణి గ్రామస్తులకు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## దేవాలయ అభివృద్ధికి నిధులు కోరుతూ వినతి



**టీ మీడియా, మే 14, ముదిగొండ:**
రావులపాటి శ్రీనివాసరావు ముదిగొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. దేవాలయ చరిత్ర, అభివృద్ధి అవసరాలను వివరిస్తూ శాసనసభ నాయకులు, స్థానిక మంత్రులు, ఉన్నతాధికారులను కలుస్తూ వినతి పత్రాలు సమర్పిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితి:ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. నిత్య పూజలు, ప్రతి శనివారం అన్నదానం జరుగుతున్నాయి. ముదిగొండ, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, టూరిస్టులు స్వామి దర్శనానికి వస్తున్నారు. ఇక్కడ అనేక వివాహాలు కూడా జరుగుతున్నాయి. రాష్ట్రంలోని ఇతర లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల సరసన ముదిగొండ ఆలయం కూడా నిలబడాలని స్థానికుల ఆకాంక్ష. తాజా పరిణామం: హైదరాబాద్‌లో జరిగిన బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గారు, ఐటీ , శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ,సీపీఐ మండల కార్యదర్శి, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు రావులపాటి శ్రీనివాసరావు , కలిశారు. విన్నపాలు :ముదిగొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలిపలు దేవాలయాల్లో ధూప దీప నైవేద్యం కింద అర్చకుల వేతనాలు మంజూరు చేయాలిమంత్రులు సానుకూలంగా స్పందించి నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



## మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లోకి వలసలు

- మునిగేపల్లి సర్పంచ్, ఐదుగురు వార్డు సభ్యుల చేరిక

**టి మీడియా, మే 14, ఖమ్మం:**
పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలంలో అధికార పార్టీలోకి వలసలు ఊపందుకున్నాయి. మునిగేపల్లి సర్పంచ్ గంగా స్రవంతి తన అనుచర వర్గంతో కలిసి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఖమ్మంలోని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఐదు నెలల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి సర్పంచ్‌గా గెలుపొందిన గంగా స్రవంతి, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. సర్పంచ్‌తో పాటు ఆమె వెన్నంటి గెలిచిన ఐదుగురు వార్డు సభ్యులు, గ్రామ ముఖ్య నాయకులు, వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాల వారు మంత్రి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## ఆటో డ్రైవర్ మృతి..

- విషాదంలో కుటుంబం

**టీ మీడియా, మే 14, సింగరేణి (కారేపల్లి):**
ఖమ్మం జిల్లా సింగరేణి మండలం విశ్వనాథపల్లికి చెందిన ఆటో డ్రైవర్ గంగాధరణి రవీంద్రాచారి (38) గురువారం మృతి చెందాడు. కొంతకాలంగా వెన్నెముక సమస్యతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో కన్నుమూశాడు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న రవీంద్రాచారి అకాల మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతునికి భార్య సౌజన్య, కుమారుడు సాత్విక్ ఉన్నారు. పేద కుటుంబానికి చెందిన రవీంద్రాచారి మృతితో ఆ కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో పడింది. రవీంద్రాచారి మృతి విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు ముత్యాల వెంకట అప్పారావు, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు వెగ్గళం నాగబ్రహ్మాచారి, తుమ్మోజు రామమూర్తి, ఆటో యూనియన్ నాయకులు మృతుడికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో యూనియన్ నాయకులు కోరారు.

# రైస్ మిల్లర్ల దోపిడీ

## అధికారుల ఆదేశాలు బేఖాతరు

- రైతుల ఆవేదన






**టీ మీడియా, మే 14, కొణిజర్ల:**
వరి ధాన్యం అమ్ముకునే రైతులకు రైస్ మిల్లర్ల దోపిడీ ఆగడం లేదు. అదనపు కలెక్టర్ స్వయంగా "బస్తాకు ఒక్క కిలో కూడా తరుగు తీయవద్దు" అని ఖరాఖండిగా ఆదేశించినా మిల్లర్లు పట్టించుకోవడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా బస్తాకు 10 కేజీల చొప్పున ధాన్యం కోత విధిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. ఫిర్యాదు చేసినా ఫలితం లేదు సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్‌కు ఫిర్యాదు చేస్తే, ఆయన మిల్లర్లతో మాట్లాడి కటింగ్స్ పెట్టవద్దని చెప్పినా క్షేత్రస్థాయిలో మార్పు లేదు. గొడవ చేస్తే ధాన్యం డబ్బుల చెల్లింపుల్లో జాప్యం చేస్తారేమోనని రైతులు భయపడుతున్నారు. రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు ధర్నాలు, రాస్తారోకోలు చేసినా ఫలితం కనిపించడం లేదు. అధికారులు మీటింగులకే పరిమితం కాకుండా మిల్లులపై నిరంతర నిఘా ఉంచాలని, తరుగు పేరిట అక్రమ కోతలు విధిస్తున్న రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పండించిన పంటను అమ్ముకోవడానికి కూడా మిల్లర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోందని రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

## గొంతు కోసి హత్య

**టీ మీడియా, మే 14, చింతూరు:**
చింతూరు మండలం మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్కవరం గ్రామంలో మూట రమేష్ (30) అనే వ్యక్తిని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. చింతూరు సీఐ గోపాల కృష్ణ పర్యవేక్షణలో మోతుగూడెం ఎస్ఐ అబ్దుల్ నాసిర్ హుస్సేన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



